సాక్షి వికారాబాద్

మంగళవారం । 14 । జనవరి । 2025



ఐక్యంగా ఉండాలి

మున్నూరు కాపులు ఐక్యంగా ఉంటూ.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మున్నూరు కాపు నేతలు అన్నారు. 8లో▸



వికారాబాద్‌లో భోగి మంటలు వేసిన యువకులు

న్యూస్‌రీల్

సంక్రాంతి శుభాకాంక్షలు



ప్రసాద్‌కుమార్

అనంతగిరి: జిల్లా ప్రజలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ భోగభాగ్యాలతో పండుగ జరుపుకోవాలన్నారు. సంక్రాంతి రైతు పండుగ అని.. పంట ఇంటికి చేరిన సమయంలో చేసుకునే వేడుక అన్నారు. మూడు రోజుల పాటు ఉత్సాహంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కబడ్డీ విజేత హస్నాబాద్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కమల్‌నాబా చారి

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో హస్నాబాద్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో కొడంగల్, మూడో స్థానంలో పెద్దనందిగామా జట్లు నిలిచారు. ఎస్వీఆర్‌ఈ ఇండస్ట్రీస్ అధినేత కమల్‌నాబా చారి విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, మూడో విజేతకు రూ.5 వేలు, కప్పులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భీములు, కుదురుమల్ల మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బండవెల్కిచర్లలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: క్రీడలతో మానసిక వికాసం పెంపొందుతుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బండవెల్కిచర్ల నిర్వహించిన లక్ష్మారెడ్డి స్మారక వాలీబాల్ టోర్నీని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యువత చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, బాలనగర్ ఎంఈఓ హరిశ్చందర్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

కొడంగల్ రూరల్: భిన్నత్వంలో ఏకత్వంలా ఉండే మన దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేలా ప్రతి ఒక్కరూ పాటుపడాలని పాలమూరు విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్), హిందూవాహిని సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు భారత దేశ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. కాలానుగుణంగా పండుగల ప్రత్యేకతను పూర్వీకులు తెలియజేశారని, మనమంతా పాటిస్తూ ముందుతరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు మన దేశ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తున్నాయని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని నిలిపేందుకు ప్రతి పౌరుడూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖండ సంఘ చాలక్ బత్తుల మల్లయ్య, ఏర్పుమళ్ల దస్తప్ప పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ జ్యూరీకి ఎంపిక

తుర్కయంజాల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం మున్సిపాలిటీ పరిధిలోని మునగనూర్‌కు చెందిన ఉదావత్ లచ్చిరామ్ దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ నుంచి ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. లచ్చిరామ్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ జ్యూరీకి ఎంపికయ్యారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో శాశ్వత సభ్యత్వం కలిగించడంతో పాటు, రూ.10వేల విలువైన పుస్తకాలను ఉచితంగా అందజేసింది.

సంక్రాంతి శోభ



అనంతగిరి: వికారాబాద్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



వికారాబాద్ మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

జిల్లా వ్యాప్తంగా సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మార్కెట్లు జనంతో కళకళలాడాయి. యువకులు, చిన్నారులు పతంగులు కొనుగోలులో బిజీగా కనిపించారు. సంక్రాంతి ముగ్గుల కోసం రకరకాల రంగులు అందుబాటులో ఉంచారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.



పరిగి పట్టణంలో భోగి మంటలు వేసుకున్న స్థానికులు



తాండూరు రూరల్: కందనెల్లిలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

చరిత్ర ఘనం ఆదరణ శూన్యం!

అభివృద్ధికి నోచుకోని ఎల్లకొండ

- శిథిలమవుతున్న వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు
- ప్రభుత్వం, దాతలు స్పందించాలని భక్తుల అభ్యర్థన

నవాబుపేట: అద్భుత శిల్పకళా సంపద, అతిపురాతన చరిత్ర కలిగిన ఎల్లకొండ ఆదరణ కరువై అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎల్లకొండ గుట్ట చుట్టూ 30 కిలోమీటర్ల వరకు ఎక్కడా గుట్టలు లేవు. దీంతో గుట్ట చుట్టూ ఎటు చూసినా పచ్చని పంటపొలాలతో కళకళలాడుతుంది. గుట్టకు రెండు కిలోమీటర్ల దూరంలో మూసీ నది(వాగు) ఉంది. ఎత్తైన గుట్టపై శివాలయం, పార్వతీపరమేశ్వరుల ఆలయం, గుట్టకింద ఉన్న శంభుదేవుడి ఆలయాలకు వెయ్యేళ్ల చరిత్ర ఉందని తెలుస్తోంది. ఇక్కడ పర్యటించిన పురావస్తు శాఖ అధికారులు పలుమార్లు ఈ విషయాలను నిర్ధారించారు. వందల సంవత్సరాల క్రితం ఇక్కడ మునులు, రుషులు సంచరించే వారని, తపస్సు చేసేవారు. అరణ్యాల్లో ఉండే మునులు ఎల్లకొండ వద్ద సేద తీరేవారని ఇక్కడి ఆధారాలు స్పష్టంచేస్తున్నాయి.

9, 10వ శతాబ్దం నాటి ఆలయాలు

ఎల్లకొండలోని శివాలయం, శిథిలావస్థలో ఉన్న శంభుని ఆలయాలు అతి పురాతన కట్టడాలు, ఇక్కడి శిల్పాలు, జైన మతానికి చెందినవిగా పూర్వీకులు చెబుతున్నారు. ఇక్కడి కట్టడాలు, శిల్పశైలి ఆధారంగా చూస్తే 9,10వ శతాబ్దం కాలంలో ఈ ఆలయాలను నిర్మించి ఉంటారని పురావస్తు శాఖ అధికారులు చెబుతున్నారు.



శిథిలావస్థలో శంభుదేవుడి ఆలయం

త్రిముఖ లింగం

శివాలయంలో త్రిముఖ(మూడు లింగాల) లింగాల ప్రతిష్ఠ ఇక్కడి ప్రత్యేకత. దీనిపై పూర్తి స్థాయిలో పరిశోధన చేస్తేగానీ వీటి విశిష్టతను చెప్పలేమని అధికారులు పేర్కొంటున్నారు. మెట్లపై జైన, కాకతీయుల కాలం నాటి నగీషీలు, గణేశుడు, ద్వారపాలకులు, వీరశిలలు, వీరభద్రుడి విగ్రహాలు అబ్బురపరుస్తున్నాయి.

కళ చెదరని కోనేరు



కొండ మధ్యలో కోనేరు అందులోనే యాత్రికులను విడిది కోసం గుదులు, మధ్యలో చిన్న శివాలయం నిర్మించి ఉన్నాయి. ఇంజినీర్ ప్లాన్‌ను తలపించేలా ఉన్న కోనేరు నిర్మాణం విశేషంగా ఆకట్టుకుంటోంది. శివాలయం ముఖద్వారంపై గజలక్ష్మి, సప్తమాత్రికలు, శిలాఫలకాలు ఉన్నాయి. కొండపై ఏడు గుహలను మలిచిన తీరు పర్యాటకులను కట్టి పడేస్తోంది. శివాలయ నిర్మాణానికి ఉపయోగించిన భాగాల్లో స్తంభాలు, రాతి కట్టడాలు, నంది, గణేశుడి విగ్రహాలు నాటి శిల్పకళను చాటుతున్నాయి. అయితే నేడు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది.



ఎల్లకొండలో అమ్మవారి ఆలయం



ముఖద్వారం నుంచి శివాలయానికి వస్తున్న భక్తులు(ఫైల్)



ఆలయంలో అమ్మవారు

ప్రశాంతతకు ప్రతిరూపం



పురాతన శంభుని ఆలయ కట్టడాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

గ్రామానికి తూర్పున శిథిలావస్థలో శంభుని గుడి ప్రశాంతతకు ప్రతిరూపంగా కనిపిస్తుంది. ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవడంతో గర్భాలయం పడిపోయింది. ముఖ మండపంలోని పైకప్పు భాగాలు ఆనాటి శిల్ప సౌందర్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వీటిపై (మలిచిన శిల్పాలు) పురాతన ఇతిహాస, గాథలు, ఓం కారసాగర, సంహారం, అష్టదిక్పాలకులు, నటరాజ, ఉమామహేశ్వర, బ్రహ్మవిష్ణు మహేశ్వర, వాలి, సుగ్రీవుడు, పూర్ణకుంభం, వాయిద్యకారులు, నృత్య భంగిమలు, బలిచక్రవర్తి ఘట్టం, రణరంగ దృశ్యాలు, సన్నివేశాలు, సాలబంజిక, యాలి, గంగాయమున చిత్రాలు ప్రజలను ఆకర్శిస్తున్నాయి. ఆలయ నిర్మాణ శైలి, శిల్పసంపదను పరిశీలిస్తే కాకతీయ తొలి యుగానికి చెందినవిగా తెలుస్తోంది. చాళుక్యులు, కాకతీయ, జైన బహమణి, కుతుబ్‌షాయి, అసబ్‌ఖాయిద్ పాలనలో ఈ గ్రామానికి ఎంతో ప్రాముఖ్యత ఉండేదని ఇక్కడి ఆధారాలు సూచిస్తున్నాయి.

పర్యాటక కేంద్రం చేయాలి



ఎల్లకొండను పర్యాటక కేంద్రం చేయాలి. ఏటా మార్చిలో నిర్వహించే వార్షికోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. టీటీడీ సాయంతో ఆలయాలకు మరమ్మతులు చేయించడంతో పాటు రోడ్డు వేయించాం. నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తే ఎల్లకొండ పర్యాటక కేంద్రంగా రూపు దిద్దుకుంటుంది.

– భరత్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వైభవం.. బోనాల ఉత్సవం

మర్పల్లి: మండలంలోని దామస్తాపూర్‌లో మంగళవారం గ్రామ దేవతల బోనాలు వైభవంగా నిర్వహించారు. దరిమీది మైసమ్మ, పెద్దమ్మ, పోచమ్మ తల్లికి 195 బోనాలతో మహిళలు ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం వరకు జాతర జరగనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మాజీ సర్పంచులు పాండురంగారెడ్డి, యాదవరెడ్డి, శాంతప్ప, జైపాల్‌రెడ్డి, రాచప్ప తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రామేశ్వర్‌రెడ్డి, సురేష్ ,యాదగిరి, మల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బాబురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



పతంగులపై ముద్రించిన కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ప్రదర్శిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఈ నెల 17న రైతు ధర్నా నిర్వహించనున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న సభా స్థలాన్ని సోమవారం బీఆర్‌ఎస్ యువ నేతలు పట్నం అవినాశ్‌రెడ్డి, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను పతంగులపై ముద్రించి ప్రజలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నక్క శ్రీనివాస్‌గౌడ్, జడల రాజేందర్‌గౌడ్, కుమ్మరి దర్శన్, అంబారెడ్డి, ముబ్రంఖాన్, సత్య, రాంచందర్, కమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పాలకవర్గం ఏర్పాటు

- నూతన కమిటీ జాబితాను అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయం అభివృద్ధి కమిటీ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో నూతన పాలకవర్గ జాబితాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారదర్శకత, ప్రాముఖ్యతతో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 19న నిర్వహిస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి జూపల్లికృష్ణారావు హాజరు కానున్నారని తెలిపారు. కమిటీ చైర్మన్‌గా మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా నక్క బాల్‌రాజ్‌యాదవ్, వీరేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యూసెట్ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా చంద్రశేఖర్, అనిల్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, సభ్యులుగా జుట్టు అనిల్‌కుమార్, ఫయాజ్, చంద్రశేఖర్‌అప్ప, రాజేశ్, కృష్ణారెడ్డి, శివరాములుయాదవ్, రాజుగౌడ్, రవినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, బస్వం అప్ప, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదుపుతప్పిన ద్విచక్రవాహనం

బైక్‌తో సహా చిలుకవాగు నాలాలో పడిపోయిన యువకుడు


బైక్‌తో సహా కాల్వలో పడిన యువకుడు

యాలాల: అదుపు తప్పిన బైక్ తాండూరు పట్టణ శివారులోని చిలుకవాగు కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఇటీవల చిలుకవాగు కాల్వ వద్ద విస్తరణ పనులు చేపట్టారు. కాగా కాల్వాపై గతంలో నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. తాండూరు-కొడంగల్ ప్రధాన రహదారిపై కొడంగల్ నుంచి తాండూరు వైపునకు బైక్‌పై వెళ్తున్న యువకుడి ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో ఆ యువకుడు పల్సర్ బైక్‌తో సహా కాల్వలో పడిపోయాడు. గమనించిన స్థానికులు యువకుడిని బయటికి తీశారు. క్షతగాత్రుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

పరిగి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పరిగి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గౌస్‌పాష అన్నారు. న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బర్కత్‌పల్లిలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. దేశంలోని ప్రతీ వ్యక్తికి సమాన న్యాయ హక్కులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి

కొడంగల్ రూరల్: అర్చకుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని దూప దీప నైవేద్య సంఘం (డీడీఎన్ఎస్) జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండగకు అందరి ఇళ్లలో ఆనందాలు వెల్లివిరిస్తున్న క్రమంలో అర్చకుల ఇంట మాత్రం ఆనందాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు అందక దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆందోళన వెల్లిబుచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యల పరిష్కరించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

వ్యక్తి దుర్మరణం


బాలమైసయ్య మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధి రాయికల్ సమీపంలోని బైపాస్ రహదారిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం, కల్లెపల్లి గ్రామానికి చెందిన బాలమైసయ్య(45) రాయికల్ శివారులోని బాబాదాబా (ఎన్‌హెచ్-44) సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైద్రాబాద్ నుంచి జడ్చర్లవైపు ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం బాలమైసయ్యను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలమైసయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన విషయం కల్లెపల్లి గ్రామం సోషల్ మీడియాలో రావడంతో గుర్తించిన మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. మృతుడి బంధువు లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

ప్రమాదవశాత్తు మంటల్లో పడి వ్యక్తి మృతి

మొయినాబాద్: వ్యర్థాలను కాలుస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మంటల్లో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చిలుకూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి మల్లేశ్(60) స్థానిక ఎస్ లిక్కర్ మార్ట్ వైన్స్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం ఆయన రాత్రి 9.30గంటల ప్రాంతంలో వ్యర్థాలను కాలుస్తూ మంటల్లో పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే మల్లేశ్ చనిపోయాడని.. వైన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సంక్రాంతి వెనుక సైన్స్

- పండుగలో జౌషధ నిధి మిలితం
- మూడు రోజులపాటు సందడి

సంక్రాంతి పండుగను తెలుగు ప్రజలు విశిష్టంగా జరుపుకుంటారు. భోగితో మొదలైన ఈ పండుగ ముక్కనుమతో ముగుస్తుంది. భోగి సందర్భంగా చలితీవ్రతను తట్టుకునేందుకు తెల్లవారు జామునే లేచి భోగి మంటలు వేస్తారు. సంక్రాంతి రోజున పిండివంటలు చేసుకోవడం, కూరగాయలు వాయినాలు ఇస్తుంటారు. కనుమ రోజున పశువులను పూజిస్తారు. పండుగ వెనుక దాగి ఉన్న సైన్స్ పరమార్థంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

షాబాద్: మన దేశంలో ప్రత్యేకతలకు పెట్టింది పేరు తెలుగు పండుగలు. ప్రకృతిలో ఉండే అనేక సంస్కృతులు, జౌషధాల గొప్పతనాన్ని చాటుతుంటాయి. ఒక్కో పండుగకు ఒక్కో శాస్త్రీయ కోణం ముడిపడి ఉంటుంది. అందులో అతి ప్రత్యేకమైనది సంక్రాంతి పండుగ. సూర్యుడు మకరరాశిలో మారే కాలంలో బంతి, చామంతి పూలు, రేగుపండ్లు, మిరపపళ్లు పుష్కలంగా దొరుకుతాయి. ముంగిళ్లలో రంగులు, రంగవల్లులు వేసి వాటిని ఆవు పేడతో గొబ్బెమ్మలు, గరికపోచలు, పిండి కొమ్ములు, తంగేడు కొమ్ములు, వాటికి పసుపు అంటించి పువ్వులతో అలంకరిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ముగ్గుల్లో సజ్జలు, జొన్నలు, బియ్యం పిండిని వాడుతారు. సంక్రాంతి ముందు రోజు భోగి నాడు మూడేళ్ల లోపు పిల్లలకు గ్రహణ పీడలు, శని తొలగి సకల ఐశ్వర్యాలతో ఉండాలని కోరుతూ రేగిపండ్లు పోస్తారు. గొబ్బెమ్మల చుట్టూ ధాన్యాలు పోసి పశుపక్ష్యాదులకు ఆహారంగా అందిస్తారు. మరుసటి రోజు సంకాంత్రి నాడు కొత్త బియ్యం, బెల్లం, నువ్వులతో పులగం వండుకుంటారు. ఇలా సంకాంత్రి పండుగ సమయంలో చేసే పనులన్నింటి వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంది. పూర్వకాలంలో మన పెద్దలు రాబోయే వైరస్‌లు, వ్యాధులను ముందుగా గ్రహించి వాటికి అనుగుణంగా ముందస్తుగా జాగ్రత్తలు పాటించేవారు. అలా మన పెద్దలు ముందస్తుగా పాటించే జాగ్రత్తలను పండుగలు, పర్వదినాన్ని బట్టి ప్రకృతిలోని జౌషధాలు, పదార్థాలను వినియోగించేవారు. అలాగే సంక్రాంతి పండుగలో సైతం అనేక ప్రత్యేకమైన జౌషధాలు, సహజసిద్ధ పదార్థాలను వినియోగించేవారు. ప్రకృతిలో లభించే వరి, శనగలు, మినుములు, నువ్వులు, సజ్జలు, పెసర్లు, బొబ్బర్లు, ఉలవలు వంటి రకరకాల ఆహార పదార్థాల్లో అనేక జౌషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

వంధ్యత్వం నివారణ

సంక్రాంతి పండుగకు నువ్వులు, బెల్లం, రేగుపండ్లు, గరిక తదితరాలు జౌషధాలతో కూడినవి. నల్లచెరకు, నువ్వులు, బెల్లంతో కూడిన ఆహార పదార్థాలు వంధ్యత్వం రాకుండా చేస్తుంది. డాక్టర్ విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాబాద్

గొబ్బెమ్మలు
- ఆవుపేడతో తయారు చేయడంతో క్రిమిసంహారకంగా పనిచేస్తుంది.
- ప్రకృతి కాలుష్య నివారిణి.
- ఉష్ణ ఉత్పత్తి ఉపయోగాలు అధికం.

పొంగలి
- సంక్రాంతి నాడు చేసే పొంగలికి బియ్యం, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. దీంతో పాటు పండుగ రోజు పిండితో అరిసెలు చేస్తారు. వీటిలోనూ పోషక విలువలు అధికంగా ఉంటాయి.

రేగుపండ్లు
- వీటిలో జౌషధగుణాలు అధికం
- వాతం, మధుమేహం, మూల వ్యాధి నివారణి
- రక్తశుద్ధి, ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.
- శరీరానికి అవసరమైన వేడి పుట్టించడంతో పాటు చలువ చేస్తుంది.
- విటమిన్-సి పుష్కలంగా లభిస్తుంది.

నువ్వులు
- శరీరంలో ఉష్ణ ఉత్పత్తిని పెంచుతాయి.
- జౌషధ గుణం ఉంటుంది.
- మూత్ర వ్యాధులను తొలగిస్తుంది
- ఎముకల్లో మజ్జ ఉత్పత్తిలో ప్రధాన ప్రాత వహిస్తుంది.

బియ్యం
- కడిగిన బియ్యం నీటిని పంచదారతో సేవిస్తే మూత్ర విసర్జన సాఫీగా ఉంటుంది.
- దప్పిక తగ్గుతుంది. వేసవిలో వడదెబ్బ నుంచి రక్షిస్తుంది.
- త్రిదోషహరిణిగా పనిచేస్తుంది.
- శరీరానికి కార్బోహైడ్రేట్లు అధికంగా అందుతాయి.

బెల్లం
- రక్తం వృద్ధి అయ్యేలా పనిచేస్తుంది.
- శరీరంలో ఖనిజ లవణాలను పెంచుతుంది.
- శరీరాన్ని కాంతిమయంగా చేస్తుంది.
- కోప, తాపాలను తాగిస్తుంది.
- సర్వ దోష లక్షణాలను నిరారిస్తుంది.



పిండి కొమ్ములు
- జీర్ణ వ్యాధులు, త్రిదోశ, ఉదరవ్యాధుల నివారిణి.
- పైత్యరసం ఉత్పత్తిలో ప్రాత వహిస్తుంది.
- రక్తం వృద్ధి చేస్తుంది.

గరక
- పచ్చి గరకను మెత్తగా నూరి గాయాలపై పూస్తే మానిపోతాయి.
- ప్రకృతి సమతుల్యతను కాపాడుతుంది.
- దగ్గు, ఆయసం, మలబద్ధకాన్ని నివారిస్తుంది.

కానిస్టేబుల్ నిర్వాకం.. వృద్ధుడికి ప్రాణాపాయం

- ఫోన్ మాట్లాడుతూ వెనక నుంచి బైక్‌తో ఢీ
- చెవిలోంచి రక్తస్రావం


బైక్ ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయిన నర్సయ్య

ధారూరు: ఓ కానిస్టేబుల్ నిర్వాకం వృద్ధుడి ప్రాణాల మీదకు తెచ్చింది. ఈ ఘటన మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం.. దోర్నాల్ గ్రామానికి చెందిన తానెం నర్సయ్య(65) పని నిమిత్తం ఎస్‌బీఐ (బ్యాంకు)కి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఫోన్ మాట్లాడుతూ వెనక నుంచి బైక్ వచ్చిన కానిస్టేబుల్ అనంతయ్య.. వృద్ధుడిని ఢీకొట్టాడు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. చెవిలోంచి రక్తస్రావం కావడంతో పక్కనే ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కానిస్టేబుల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుడికి కొడుకు సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ మాత్రం తనదేం తప్పు లేదని, ఆయనే పడిపోయాడని చెప్పి వెళ్లిపోయాడు. అయితే కానిస్టేబుల్ బైక్‌పై వస్తూ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, వృద్ధుడిని గమనించకుండా ఢీ కొట్టాడని అక్కడున్న వారు తెలిపారు. వాస్తవం తెలియాలంటే పెట్రోల్ పంపు, వైన్‌షాప్, ఎస్‌బీఐ వద్ద ఉన్నసీసీ కెమెరాలను పరిశీలిస్తే.. తప్పు ఎవరిదో తెలుస్తుందన్నారు.

యువతిని ఢీ కొట్టిన కారు


ఘటనా స్థలిలో పడిపోయిన యువతి

మణికొండ: రోడ్డు ఎత్తుగా ఉండటంతో అదుపుతప్పిన కారు స్కూటీపై వెళ్తున్న ఓ యువతిని ఢీ కొట్టింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీలో ఆదివారంరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హుడా కాలనీలోని లైట్ అండ్ లైట్ వద్ద భాగ్యలక్ష్మి కాలనీ వైపు నుంచి వచ్చిన మారుతి బ్రీజా కారు వచ్చింది. ఓపెన్ జిమ్ వద్ద ఓ మహిళ కారును నడుపుతూ, స్కూటీపై వస్తున్న ఎంప్లాయీస్ కాలనీకి చెందిన గాయత్రిని ఢీకొట్టింది. కారు, ఓపెన్ జిమ్ గోడ మధ్యల గాయత్రి చిక్కుకోవటంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గాయాలపాలైన యువతిని వెంటనే మణికొండలోని ఆవాస ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.


రేగడిమైలారంలో రథయాత్ర ప్రారంభిస్తున్న ఎన్‌వై అశోక్ మాదిగ తదితరులు

మాదిగలంతా డప్పుతో రావాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్‌వై అశోక్
- రేగడి మైలారంలో 'వేల గొంతులు-లక్ష డప్పులు' రథయాత్ర ప్రారంభం

బొంరాస్‌పేట: మాదిగ ఉపకులాల సామాజిక న్యాయం కోసం మందకృష్ణ మాదిగ చేపట్టిన పోరాటానికి డప్పులతో రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్‌వై అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని రేగడిమైలారంలో 'వేల గొంతులు-లక్ష డప్పులు'రథయాత్ర ప్రారంభించారు. ముందుగా మాజీ ఎంపీ మందా జగన్నాథం మాదిగకు, మాదిగ అమరులకు నివాళి అర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి రథయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర మండల పరిధిలోని చౌదర్‌పల్లి, నాందార్‌పూర్, తుంకిమెట్ల గ్రామాల మీదుగా సాగింది. ఫిబ్రవరి7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు-లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

త్వరలో కొడంగల్‌కు మందకృష్ణ

జిల్లా స్థాయి రథయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంకిమెట్లలో విలేకరుల సమావేశంలో చెప్పారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా స్థాయి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని వివరించారు. మండలాల వారీగా పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు రాంచందర్, స్వామి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ, ప్రధాన కార్యదర్శి సుభాశ్, ఉపాధ్యక్షుడు మల్కప్ప, మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, అరుణోదయ అనిత, రమేశ్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, దాసరి చంద్రప్ప, గ్రామాల అధ్యక్షుడు యేసు, బందెప్ప, వెంకటయ్య, తదితరులున్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

- శ్రీవారి ఆలయంలో పులకించిన భక్తజనం
- స్వామివారికి విశేష సేవలు


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కొడంగల్: ఓం నమో వేంకటేశాయ.. ఓం నమో పరమాత్మనే.. కొడంగల్ నివాసాయ శ్రీనివాసాయ మంగళం.. అంటూ శ్రీహరి నామస్మరణతో కొడంగల్ ఆలయం మార్మోగింది. పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. టీటీడీ తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా ఈ క్రతువును పూర్తిచేశారు. వేద మంత్రాలు, స్వామివారి కీర్తనలు భక్తులను పులకింపజేశాయి. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారి, అమ్మవార్ల మూల మూర్తులను అందంగా అలంకరించారు. గర్భాలయం నుంచి ఉత్సవ మూర్తులను తెచ్చి పెళ్లి మండపంలో ప్రతిష్ఠించారు. అర్చకులు, భక్తుల సమక్షంలో పూజలు నిర్వహించారు. హారతులు, అర్చనలతో భక్తులు స్వామివారికి పూజలు చేసి తరించారు. ప్రత్యేక ప్రసాదం కదంబం తయారు చేయించి భక్తులకు పంపిణీ చేశారు. నెల రోజుల పాటు తిరుప్పావై పారాయణం నిర్వహించిన అనంతరం గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథస్వామిని వివాహం చేసుకున్న శుభ ఘడియల్లో వేడుకలు నిర్వహించారు.


తాళి బొట్టు చూపిస్తున్న పురోహితుడు

ముగిసిన ధనుర్మాస పూజలు

పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 16న ప్రారంభమైన ధనుర్మాస పూజలు సోమవారం ముగిశాయి. తిరుమల తిరుపతి తరహాలో ధనుర్మాస పూజలు చేయడం ఇక్కడి ఆచారం. దరూర్ శ్రీనివాసాచార్యులు ప్రతి రోజు తిరుప్పావై పారాయణం పఠించి భక్తులకు వినిపించారు. ధనుర్మాసం ముగింపు వేడుకల్లో వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాగయ్య

కుల్కచర్ల: జాతీయ భావాలను పెంపొందించుకోవడంతో పాటుగా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో కుల్కచర్ల శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటుగా వ్యవసాయంలోనూ అలనాటి పద్ధతులను పాటించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి, ఆరోగ్యమైన పంట లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘ నాయకులు ప్రహ్లాదరావు, ఎల్లయ్య, ఆంజనేయులు, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలోనే పోయిన ప్రాణాలు

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మంచాల: వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుట్ల గ్రామానికి చెందిన పోలమోని సత్తయ్య (70) తన వ్యవసాయ పొలం వద్ద కూరగాయాల తోటలకు నీళ్లు పెట్టడానికి సోమవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు కాళ్లు తగలడంతో షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఫిలింనగర్‌లో భారీ చోరీ

ఫిలింనగర్: వృద్ధ దంపతుల ఇంట్లో భారీగా నగదు, నగలు చోరీకి గురైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లో నివసించే అరుణాదేవి, లక్ష్మయ్య దంపతులు ఈ నెల 10న ఉదయం వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు సమీపంలోని గుడికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికి అరుణాదేవి జిమ్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చింది. 11న ఉదయం అరుణాదేవి నిద్ర లేచి బయటికి వచ్చి చూడగా బాత్‌రూమ్ తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఆ పక్కనే జ్యువెలరీ బాక్స్‌లు పడి ఉండటంతో ఆందోళనకు గురైన ఆమె అల్మరా తెరిచి చూడగా అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదు, బంగారు గాజులు, నెక్లెస్‌లు తదితర ఆభరణాలన్నీ చోరీకి గురైనట్లు గుర్తించింది. తాము ఇంట్లో లేని సమయంలో లేదా నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కిటికీలో నుంచి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడి ఉండవచ్చునని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి

రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

కొడంగల్: మున్నూరు కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మున్నూరు కాపు రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు, కవి, ఆధ్యాత్మిక వేత్త భాస్కర యోగి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన మున్నూరు కాపు కుల బంధువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామ కమిటీలు, మండల కమిటీలు, తాలూకా కమిటీల ఆధ్వర్యంలో 2025 సంవత్సరం క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మున్నూరు కాపు కుల బంధువులు ఐకమత్యంగా ఉండాలన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్ర మహాసభ ద్వారా విద్యార్థులకు కాచిగూడలో హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉపకార వేతనాలు, మెరిట్ స్కాలర్ షిప్‌లు, పాఠ్యపుస్తకాలు ఇస్తున్నట్లు వివరించారు. పేదింటిలో పెళ్లికి పుస్తె మట్టెలు ఇస్తున్నట్లు చెప్పారు. రాజకీయంగా ఎదగడానికి ప్రతీ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్‌కుమార్, ప్రకాశ్, నాగరాజు, సత్యనారాయణ, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు పెద్ది పెంటయ్య, ఉపాధ్యక్షుడు కోరమోని వెంకటయ్య, బుచ్చిరెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, కోశాధికారి నర్సిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, బిచ్చప్ప, అరిగె ఓం ప్రకాశ్, శ్యాంసుందర్, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంత ప్రసాద్, యువక మండలి అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శేఖర్, శ్రీనివాస్, గౌరీశంకర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఐకమత్యానికి నెలవు

తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి



ఎంపీఎల్ విజేత నిహార్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తదితరులు

తాండూరు టౌన్: క్రీడా పోటీలు సమైక్యతను పెంపొదిస్తాయని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మార్వాడీలు వ్యాపారానికి మాత్రమే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలను సైతం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి సంవత్సరం మార్వాడీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. క్రీడలు ఐకమత్యానికి నెలవుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీబీఎల్ సీఈఓ బయ్యని శ్రీనివాస్ రెడ్డి, మంచ్ సభ్యులు రమేష్ చంద్ర సార్డా, మన్మోహన్ సార్డా, సంతోష్ రాఠి, అనిల్ సార్డా, సచిన్ రాఠి, అరుణ్ సార్డా తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన నిహార్ జట్టుకు ప్రథమ బహుమతిని డీఎస్పీ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా అభిషేక్ సార్డా, బెస్ట్ బ్యాటర్‌గా నిహార్ సోమాని, బెస్ట్ బౌలర్‌గా కేశవ్ రాఠి, బెస్ట్ ఫీల్డర్‌గా వినయ్ సార్డా, బెస్ట్ క్యాచర్‌గా అజయ్ సార్డాలకు బహుమతులను అందజేశారు.



సదర్ సయ్యాట



అల్లిఖాన్‌పల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులస్తులు దున్నపోతులను అందంగా ముస్తాబు చేసి ఊరేగింపు నిర్వహించారు. బ్యాండు చప్పుళ్లు, డీజే మోతల నడుమ యువకుల నృత్యాలు, దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

– దుద్యాల్

సెరాయ్ గ్రాండేలో పోలీసుల తనిఖీలు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సెరాయ్ గ్రాండే హోటల్‌లో మాదాపూర్ ఎస్ఓటీ, రాయదుర్గం లా అండ్ ఆర్డర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలపై రొటిన్‌గా తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బంధువుకు చెందిన హోటల్‌లో పోలీసులు ఎలాంటి సెర్చ్ నోటీసు లేకుండా తనిఖీలు చేశారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయమై రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న మాట్లాడుతూ రొటిన్ చెకప్‌లో భాగంగానే తనిఖీలు నిర్వహించామని ఎలాంటి డ్రగ్స్ లభించలేదన్నారు. పండుగ సమయంలో హోటల్స్‌లో పేకాట ఆడే అవకాశం ఉందన్నారు. ఉద్దేశ పూర్వకంగా తనిఖీలు చేపట్టలేదని అన్నారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎంట్రీ, ఎగ్జిట్ వే నుంచి పెద్ద సంఖ్యలో పోలీసులు లోపలికి వచ్చి తనిఖీలు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.